క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సాయం


కార్మికులకు నగదు అందిస్తున్న ఎల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎన్ఆర్ఐ దంపతులు పెడుత బాలమణిప్రతాప్‌రెడ్డి అండగా నిలిచారు. మండల పరిధిలోని ముస్త్యాలలో తొమ్మిది మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున బతుకమ్మ, దసరా పండుగ ఖర్చులకుగాను మంగళవారం అందజేశారు. నగదును మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి కార్మికులకు అందజేశారు. ఎన్ఆర్ఐ దంపతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అడహక్ కమిటీ చైర్మన్ నియామకం


నియామకపత్రం అందిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేటజోన్: జిల్లా పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(పాపా) అడహక్ కమిటీ చైర్మన్‌గా దయాసాగర్ నియమితులయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బూర మల్లేశం, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, న్యాయవాదులు, ఇంజనీర్లు, రిటైర్ ఉద్యోగులు పాపాలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490243095 నంబరును సంప్రదించాలని సూచించారు.. సంఘం ప్రతినిధులు భిక్షపతి, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన


ఓ బ్యూటీ పార్లర్‌లో విద్యార్థులకు శిక్షణ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు స్వయం ఉపాధిపై దృష్టిసారించేందుకు అవగాహన కల్పిస్తున్నామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వన్నెసా చెప్పారు. బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తమలోని నైపుణ్యాన్ని చాటాలన్నారు. పది రోజులపాటు పట్టణంలోని పలు బ్యూటీ పార్లర్లలో ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్స్ కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కిషన్, ఒకేషనల్ ట్రైనర్ ప్రశాంతి, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్, గ్యాస్‌పై జీఎస్టీ వద్దు


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు దుకాణాలలో అమలులోకి వచ్చిన జీఎస్టీ తగ్గింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు అమలులోకి వచ్చి 48 గంటలు గడిచినా దుకాణాల్లో పాత ధరలకే అమ్ముతున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గిస్తే ప్రజలకు నెలకు రూ.10 వేలు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణతో మరింత నైపుణ్యం


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: దసరా సెలవులలో భాగంగా లహరి కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో మిరుదొడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తివిద్యపై పది రోజులపాటు నిర్వహించనున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా వారిలో నైపుణ్యం మరింత పెంపొందుతుందన్నారు. విద్యార్థులు సెలవులను శిక్షణ కోసం కేటాయించాలని సూచించారు. ఒకేషనల్ ట్రైనర్ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకు పడితే అంతే..

- నీట మునిగిన ప్రధాన కూడలి
- కల్వర్టు లేకే కష్టాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న ప్రధాన కూడలి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. గ్రామంలో నీరంతా అక్కడికి చేరి దుర్వాసన వెదజల్లుతోంది.

ముక్కు మూసుకోవాల్సిందే..

గ్రామంలో ప్రధాని రహదారి కావడంతో స్థానికులంతా అటే వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామం నుంచి బయటకు వెళ్లాలన్నా, రావాలన్నా ఈ కూడలి నుంచే రావాలి. అలాగే మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులు ఈ రానినుంచే రావాల్సి ఉంటుంది. మల్లన్న ఆలయం నుంచి పాత కమాన్ వరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మించి నాలుగేళ్లవుతోంది. ఆ సమయంలో పాతరోడ్డు కంటే ఎక్కువ ఎత్తులో నూతన రోడ్డును వేశారు. దీంతో వర్షం కురిసినప్పుడు డ్రైనేజీ నుంచి వచ్చే నీటితో పాటు గ్రామంలో నుంచి వచ్చే వరద నీరు చేరి బురద మయంగా మారుతోంది.


కొమురవెల్లి ప్రధాన కూడలిలో నిలిచిన నీరు

కల్వర్టు నిర్మించాలి

మరుగు నీరు బయటకు వెళ్లేందుకు కల్వర్టు నిర్మించాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్మించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులను కల్వర్టు నిర్మించాలని కోరితే తమ వద్ద నిధులు లేవని చెబుతున్నారని, ఇప్పటికైనా కలెక్టర్, మంత్రులు నిధులు మంజూరు చేసి కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

పంచాయతీలో నిధులు కరువు

గ్రామంలో గతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పాడైపోయింది. దానికి మరమ్మతులు చేస్తున్నాం. కొత్తగా నిర్మించడానికి పంచాయతీలో నిధుల్లేవు. వర్షపునీరు బయట పోవాలంటే కల్వర్టు నిర్మాణమే శరణ్యం. నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతాం.
-హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

బయటకు రాలేని పరిస్థితి



చినుకు పడితే చాలు గ్రామ ప్రధాన కూడలి వద్ద నీరుచేరి నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లడంతో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఆ దారి గుండా వెళ్లాలంటే భయమేస్తోంది. అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా నిధులు లేవని సమాధానం చెబుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి.
- కరుణాకర్, గ్రామస్తుడు

ఆరోగ్య పరిరక్షణకే వైద్య శిబిరాలు

డీఎంహెచ్ఓ ధన్‌రాజ్

బెజ్జంకి(సిద్దిపేట): ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ అన్నారు. 'స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. మహిళలు వైద్య పరీక్షలు చేయించుకుని వారి కుటుంబాలకు అవగాహన కల్పించాలని సూచించారు. శిబిరంలో ఎనిమిది మంది వైద్యులు సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆస్పత్రి వైద్యురాలు మాధురి, నసీమ్, స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ ఆస్పత్రిలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు సత్య ప్రకాశ్ మాట్లాడుతూ శిబిరంలో 223 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఎనిమిది రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని చెప్పారు.


ఓపీ వివరాలు పరిశీలిస్తున్న ధన్‌రాజ్

తూమ్‌కు మరమ్మతులు చేయించాలి

బీఆర్ఎస్ నేత మల్లికార్జున్ రెడ్డి

హుస్నాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిన చెరువు కట్ట తూమ్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ పండుగ సమీపిస్తున్నా సుందరీకరణ పనులు పూర్తి కాలేదన్నారు. వర్షాలకు చాలా చోట్ల చెరువు కట్టకు గండ్లు పడ్డాయని, ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ సందర్భంగా వందలాది మంది చెరువు కట్టకు వస్తారని, వారంతా ఇబ్బందులు పడే అవకాశం ఉందని వాపోయారు. చెరువు కట్ట మరమ్మతులకు గతంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సుందరీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి బతుకమ్మ ఆడుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, వికాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.


చెరువు కట్ట పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


చేర్యాల(సిద్దిపేట): మాట్లాడుతున్న కనకరాజు

చేర్యాల(సిద్దిపేట): స్థానికంగా లభించే పోషక పదార్థాలను తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పోషణ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ కనకరాజు అన్నారు. మండల పరిధిలోని ముస్త్యాల రైతు వేదికలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పోషణ బీ పడాయి బీ, ప్రీ స్కూల్, నవజాత, చిన్నారుల పోషణ ప్రాముఖ్యం గురించి వివరించారు. అలాగే పోషణ కార్యక్రమాల్లో పురుషులను ఎలా భాగస్వామ్యం చేయాలో తెలియజేశారు. అక్టోబర్ 16 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రాధాన్యం చాటిచెప్పేందుకే..

గజ్వేల్: పోషకాహార ప్రాధాన్యం గురించి చాటిచెప్పేందుకు పోషణ సంబురాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య చెప్పారు. మండలంలోని రిమ్మనగూడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నెల రోజులపాటు నిర్వహించనున్న సంబరాల్లో ప్రజలు భాగస్వాములను చేస్తామని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు రజని, మణెమ్మ పాల్గొన్నారు.

తాళ్లపల్లిలో...

దుబ్బాకరూరల్: తాళ్లపల్లి అంగన్‌వాడీలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఆశా వర్కర్ కవిత, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించండి


హాజరైన కౌన్సిలర్లు

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలి
- సమానంగా నిధులు కేటాయించండి
- బల్దియా సమావేశంలో కౌన్సిలర్లు

సిద్దిపేటజోన్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని చాలా వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, వాటిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ మంజుల అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు సమస్యలపై మాట్లాడారు. డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసం అయిందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో వార్డుల్లో ఇబ్బందులు లేకుండా రహదారులకు మరమ్మతులు చేయించాలని, గుంతలను పూడ్చాలని కోరారు. కోమటి చెరువు వద్దకు సద్దుల బతుకమ్మ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉందని, ఏర్పాట్లు వేగవంతం చేయాలని కోరారు. మున్సిపల్‌కు మంజూరైన నిధులను అన్ని వార్డులకు సమానంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్ నిధులతో చేపట్టనున్న పనులను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మంజుల మాట్లాడుతూ వార్డుల్లో బల్దియా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం అజెండా అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ఆశ్రిత్, కౌన్సిలర్లు రేణుక, కవిత, శోభారాణి, పూర్ణిమ, తస్లీమ్, అరవింద్, వినోద్, సుందర్, విఠోభ, ప్రవీణ్, రవి, బ్రహ్మం, నాగరాజు రెడ్డి, మల్లికార్జున్, సాయి కుమార్, రియాజ్, సాయి ఈశ్వర్, మల్లికార్జున్, కో ఆప్షన్ సభ్యులు షాహెద్, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు

'బతుకమ్మ' కోసం తప్పని తిప్పలు


స్థలాన్ని సరి చేస్తున్న మహిళలు

దుబ్బాకటౌన్: బతుకమ్మ పండుగ అంటేనే ఆడపడుచులకు ప్రత్యేకమైన పండుగ. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బతుకమ్మ ఆడే స్థలం బురదమయం కావడంతో పంచాయతీ కార్యదర్శికి విన్నవించుకున్నా ఫలితం లేదు. ఉన్నతాధికారులు మహిళలకు బతుకమ్మ ఆడుకోవడానికి సిద్ధం చేస్తారని ఎదురుచూసినాలాభం లేకుండా పోయింది. రాయపోల్ మండల కేంద్రంలో 6వ వార్డులో బతుకమ్మలు ఆడే కామునికంతలో వర్షం నీరు నిలిచి బురదమయంగా ఉండడంతో మొదటి రోజు బతుకమ్మ ఆడడానికి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఓపిక నశించిన మహిళలు వారే సొంత నిధులతో ఎడ్లబండి సహాయంతో సిమెంట్ తీసుకొచ్చి సీసీ వేశారు.

ఒకరిపై పోక్సో కేసు

కొండపాక(గజ్వేల్): ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఓ గ్రామానికి చెందిన బాలికతో లకుడారం గ్రామానికి చెందిన కంకణాల మల్లేశం అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిద్దిపేటలోని భరోసా(సకి) కేంద్రానికి పంపించారు. భరోసా కేంద్రంలో బాలిక వాగ్మూలం రికార్డు చేసి పోలీస్ స్టేషన్‌కు పంపించారు. ఆ స్టేట్‌మెంట్ ఆధారంగా పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైద్య పరీక్షల కోసం వచ్చి అగచాట్లు

అసహనం వ్యక్తం చేసిన మహిళలు

నంగునూరు(సిద్దిపేట): రక్త నమూనా తీసుకొని 32 రకాల పరీక్షలు చేస్తారని తరలి వచ్చిన మహిళలు అవస్థలు పడ్డారు. ఐకేపీ, ఆరోగ్యశాఖ సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి వచ్చిన మహిళలు ఇబ్బందుల పాలయ్యారు. 'ఆరోగ్య మహిళ, శక్తివంతమైన కుంటుంబం' కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షల కోసం రాజ గోపాల్‌పేట పీహెచ్‌సీకి వెళ్లాలని ఏడు గ్రామాలలో ఐకేపీ సిబ్బంది ప్రచారం చేశారు. దీంతో ఆయా గ్రామాల నుంచి మహిళలంతా పీహెచ్‌సీకి తరలి వచ్చారు. కానీ వైద్యులు పరీక్షలు నిర్వహించకపోవడంతో ఆగ్రహించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతికి ఏకరువు పెట్టారు. కానీ ఫలితం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ముద్ద పప్పు బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామాల్లో మహిళలు ముద్దపప్పుతో బతుకమ్మకు నైవేద్యం సమర్పించారు. బతుకమ్మల ఆటలు ఆడి చెరువుల్లో నిమజ్జనం చేశారు.


దుబ్బాకలో బతుకమ్మలతో మహిళలు


జగదేవ్‌పూర్(గజ్వేల్): అలిరాజ్‌పేటలో..


మిరుదొడ్డి(దుబ్బాక): ఐకేపీలో బతుకమ్మ ఆడుతున్న మహిళా సంఘాల సభ్యులు

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మాధవరెడ్డి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పన్యాల మాధవరెడ్డి(94) అనారోగ్యంతో కన్ను మూశారు. ఉమ్మడి మిరుదొడ్డి మండల పరిధిలోని జంగపల్లి పంచాయతీ కింద మదిర గ్రామంగా ఉన్న వీరారెడ్డిపల్లి 1965లో విడిపోయి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. అప్పటి నుంచి 1995 వరకు వీరారెడ్డిపల్లి గ్రామానికి మాధవరెడ్డి ఏకగ్రీవ సర్పంచ్‌గా 30 సంవత్సరాలుగా గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. కాగా వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాధవరెడ్డి మాధవరెడ్డి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు రవి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాల మల్లేశం గౌడ్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

సంక్షిప్త వార్తలు

◆ పంట నమోదు 30తో పూర్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు తమ పంట నమోదును 30లోగా పూర్తి చేసుకోవాలని ఏఓ సంతరావు సూచించారు. మండలంలోని తిగుల్ గ్రామంలో మంగళవారం ఆయన పంట నమోదు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తప్పకుండా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

◆ ట్రెసా డివిజన్ అధ్యక్షుడిగా అరవిందు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (ట్రెసా)అధ్యక్షుడిగా ఆర్డీవో కార్యాలయం నాయబ్ తహసీల్దార్ దుస్సా అరవిందు ఎన్నికయ్యారు. డివిజన్ పరిధిలోని కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల రెవెన్యూ అధికారులు డివిజన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రుక్మిణిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం సురేందర్‌ను ఎన్నుకున్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కోమటి చెరువు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు, టీచర్స్, హరిప్రియనగర్ కాలనీలతో పాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్, తదితర ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

◆ బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు

దుబ్బాక: బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు. 7వ వార్డు ధర్మాజీపేటలో బతుకమ్మలు వేసేందుకుగాను చెరువువద్ద మంగళవారం చదును చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు మున్సిపాల్టీకి రూ.10 లక్షలు కేటాయించారన్నారు. ఆయన వెంట మేనేజర్ శ్రీనివాస్, ప్రవీణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

◆ ప్రభుత్వభూమి పరిరక్షణకు వినతి

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రం వర్గల్‌లోని ప్రభుత్వభూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కొందరు స్థానికులు మంగళవారం తహశీల్దార్ రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 1044లోని ప్రభుత్వభూమిని కొంత మంది ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అక్కడ బోర్డులు ఏర్పాటు చేసి సంరక్షిస్తామని తహసీల్దార్ తెలిపారు.

◆ ముస్లింల మనోభావాలు దెబ్బతీయొద్దు

సిద్దిపేటజోన్: కొడంగల్ రోడ్డు విస్తరణ పేరిట ముస్లింలకు చెందిన మూడు ఖబ్రస్థాన్లు, ఒక దర్గాను కూల్చివేశారని, ఇది ముస్లిం మనోభావాలను దెబ్బతీసినట్లుగా భావిస్తున్నామని బీఆర్ఎస్ సిద్దిపేట మైనార్టీ ప్రతినిధులు అన్నారు. స్థానిక ఎక్బాల్ మినార్ వద్ద మంగళవారం వారు ఆందోళన చేశారు. కౌన్సిలర్లు వజీర్, మోహిజ్ మాట్లాడారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాహెద్, నాయకులు అహ్మద్, జావేద్, జాకీర్, షాహిద్, మోహిజ్, సాకత్ పాల్గొన్నారు.

◆ హోటళ్లు, బేకరీలలో తనిఖీలు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని పలు హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మంగళవారం తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత పాటించని వారిపై జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, బిల్ కలెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.

గాయత్రి.. ఆది పరాశక్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మండపాలు, ఆలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువకులు ప్రత్యేక పూజలు చేశారు.


మిరుదొడ్డి(దుబ్బాక): అమ్మవారి పూజల్లో భక్తులు


నంగునూరులో పూజలు చేస్తున్న యువకులు


చిన్నకోడూరు(సిద్దిపేట): రాముని పట్లలో..

వేతనాలు చెల్లించాలని నిరసన

సిద్దిపేటకమాన్: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆస్పత్రి ఎదుట మంగళవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.